

'మిట్స్' ప్రొఫెసర్‌కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు

ప్రజాశక్తి-మదనపల్లి

మిట్స్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ శివయ్యకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. 2024 సంవత్సరానికి గాను స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీ ప్రపంచంలోని టాప్ 2 సైంటిస్టుల జాబితాలో ప్రొఫెసర్ శివయ్యకు గుర్తింపు లభించిందని పేర్కొన్నారు. పరిశోధన రంగంలో చేసిన కృషికి గాను ఈ ఘనత సాధించినట్లు చెప్పారు. ప్రొఫెసర్ శివయ్యను కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ నాదేళ్ల విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదేళ్ల, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, అడ్వైజర్ ఆర్‌అండ్‌డి డాక్టర్ తులసీరామ్ నాయుడు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.



ప్రొఫెసర్ శివయ్యను అభినందిస్తున్న ప్రిన్సిపల్ యువరాజ్

తమ్ముళ్లకు దక్కని చోటు!

తాజా నామినేటెడ్ పదవుల్లో మొండిచేయి
టికెట్లు త్యాగం చేసిన వారికీ తప్పని నిరాశ
ఆందోళనలో టిడిపి కేడర్



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలోని తెలుగు తమ్ముళ్లకు నిరాశ తప్పలేదు. రాష్ట్రంలో అప్పటి అధికార వైసిపిని ఎదుర్కోవడంలో భాగంగా టిడిపి, జనసేన, బిజెపి సంయుక్తంగా కూటమిని ఏర్పడిన సంగతి తెలిసిందే. ఎన్‌డిఎ కూటమి ఏర్పాటులో టికెట్లను త్యాగం చేసిన వారికి గుర్తింపు ఉంటుందని ఆశించిన వారికి నిరాశ తప్పలేదు. తాజాగా విడుదల చేసిన 20 నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి జిల్లాకు మొండిచేయి చూపించారు. 2019 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చిన సంగతి తెలిసిందే. అప్పటి అధికారులు టిడిపి కార్యకర్తలే టార్గెట్‌గా సాగిన వైసిపి దాడుల్లో వందలాది మంది కార్యకర్తలు తీవ్రంగా నష్టపోయారు. నష్టపోయిన కార్యకర్తలను ముందుగా ఆదుకోవాల్సిన నాయకత్వం పలుకుబడి కలిగిన నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం మింగుడుపడడం లేదు. రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమిలో ప్రధాన పార్టీ అయిన టిడిపి కార్యకర్తలు వైసిపి కేడర్ బారిన పడి ప్రాణాలను సైతం లెక్క చేయని సంగతి తెలిసిందే. నామినేటెడ్ పదవుల్లో ఉమ్మడి జిల్లాకు చెందిన ఏ ఒక్కరికీ చోటు లభించలేదు. ఎన్‌డిఎ కూటమి ఏర్పాటులో భాగంగా టికెట్లను కోల్పోయిన వారిలో ఉమ్మడి జిల్లాలో ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, రైల్వేకోడూరు, రాజంపేట నియోజకవర్గాలకు చెందిన నాయకులు ఉన్నారు. జమ్మలమడుగు టికెట్ కోసం చివరి వరకు పోరాడిన భూపేష్‌రెడ్డి, ప్రొద్దుటూరు టికెట్ కోసం పోరాడిన ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రైల్వేకోడూరు టికెట్ త్యాగం చేసిన పంతగాని ప్రసాద్, ఓ మహిళా నాయకురాలు, రాజంపేట టికెట్ వదులుకున్న బత్యాల, కడప మైనార్టీ టికెట్‌ను సైతం వదలుకున్న సీనియర్ నాయకులు అమీర్‌బాబు వంటి పార్టీ కోసం పూర్తి సమయాన్ని కేటాయించిన, ఆరుగాలం కృషి చేసిన సీనియర్ కార్యకర్తలు, నాయకులకు నిరాశ కలిగించింది. టికెట్లు ఆశించిన స్థాయిని కలిగిన పలువురు సీనియర్ నాయకులు సైతం ఉన్నారు. ఇటువంటి వారిలో ఏ ఒక్కరికీ నామినేటెడ్ పోస్టుల్లో చోటు లభించలేదు.

కెజిబివిల్లో మౌలిక సదుపాయాలు : కలెక్టర్



కెజిబివి సమీక్షలో హెచ్‌ఎం నుంచి వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-రాయచోటి

కెజిబివి పాఠశాలల విద్యార్థుల సమస్యలను సొంత పిల్లల సమస్యల్లాగా భావించి పరిష్కరించాలని, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై ఎలాంటి రాజీపడరాదని కలెక్టర్ చామకూరి శ్రీధర్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాల్‌లో జిల్లాలోని కెజిబివి పాఠశాలలలో మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై జిల్లా విద్యాశాఖ అధికారి శివ ప్రకాష్‌రెడ్డితో కలిసి కెజిబివి పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముందుగా రామాపురం మండల కెజిబివి ప్రధానోపాధ్యాయులు పుష్పలత జిల్లాలోని కెజిబివి పాఠశాలలపై వివిధ అంశాలను కలెక్టర్‌కు వివరించారు. జిల్లాలో 22 కెజిబివి పాఠశాలలు ఉన్నాయని, 2023-24 సంవత్సరంలో 10వ తరగతి పరీక్షల్లో 86 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. ఇదే సంవత్సరం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 64 శాతం ఉత్తీర్ణులయ్యారని, రెండవ సంవత్సరం 72 శాతం ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అనంతరం కెజిబివి పాఠశాలల్లో పిల్లలకు అందిస్తున్న భోజనం, పాఠశాలల్లోని మరుగుదొడ్లు, ఏర్పాటు చేసిన సిసి టివిలు తదితర అంశాలపై కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు మినహా బయట వారు ఎవ్వరినీ పాఠశాలలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. బయటి వారిని ఎవరినైనా అనుమతిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మరుగుదొడ్ల పరిశుభ్రత, రక్షిత మంచినీరు, మంచి భోజన వసతి, పిల్లలు నిద్ర పోవడానికి తగిన వసతులు, వంటి కనీస మౌలిక సదుపాయాలపై ఎలాంటి రాజీ పడరాదని, ఏదైనా సమస్యలు ఉంటే పాఠశాలలకు ఇచ్చిన బడ్జెట్లో వాటిని పరిష్కరించుకోవాలన్నారు. సమావేశంలో జిల్లాలోని కెజిబివి పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఆటల పోటీలకు 56 మంది ఎంపిక

ప్రజాశక్తి-పీలేరు : జిల్లా స్థాయి ఆటల పోటీలకు 56 మంది విద్యార్థులు ఎంపికైనట్లు పీలేరు నియోజకవర్గం సమన్వయకర్త జె.ఉషారాణి, పీడీ,పిఇటి అసోసియేషన్ సెక్రటరీ రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం వేదికగా 15 రకాల క్రీడల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గుర్రంకొండ, కలకడ, కంభంవారిపల్లి, వాల్మీకిపురం, కలికిరి, పీలేరు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 560 మంది విద్యార్థులు పోటీలకు హాజరయ్యారన్నారు. బాల, బాలికలను సీనియర్స్, జూనియర్స్ జట్టుగా విభ జించి వారికి విడివిడిగా రన్నింగ్ రేస్, లాంగ్ జంప్, హై జంప్, షాట్ పుట్, డిస్క్ త్రో, మొదలగు క్రీడా విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. నియోజకవర్గ స్థాయిలో ఇక్కడ ఎంపికైన 56 మంది క్రీడాకారులను ఈ నెల 26న చిత్తూరు డిఎస్‌ఎ స్టేడియంలో జరగనున్న జిల్లా స్థాయి ఆటల పోటీలకు తీసుకు వెళ్ళనున్నట్లు వారు చెప్పారు.



లాంగ్ జంప్‌లో ప్రతిభ చూపుతున్న విద్యార్థిని



మాట్లాడుతున్న డిఐజి కోయ ప్రవీణ్

గంజాయి అక్రమ రవాణాపై చర్యలు : డిఐజి

ప్రజాశక్తి-ములకలచెరువు

రాష్ట్రంలో ఎక్కడా గంజాయి, మాదకద్రవ్యాల అమ్మకాలు జరగకుండా వాటిపై ఉక్కుపాదం మోపుతున్నట్లు కర్నూల్ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్ తెలిపారు. మంగళవారం సాయంకాలం ములకలచెరువు సర్కిల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పోలీసుస్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులు, వాటి పరిష్కారాలపై సిఐ, ఎస్‌ఐలను ఆరా తీశారు. సర్కిల్ పరిధిలో ఎలాంటి గంజాయి అమ్మకాలు, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం అమ్మకాలు జరగకుండా చేపట్టాల్సిన చర్యలపై పోలీసులకు వివరించారు. గంజాయి, మాదకద్రవ్యాలు అమ్మకాలు ఎక్కడ జరిగినా వాటిపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, దొంగతనాలు, దోపిడీలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాత్రి వేళల్లో గస్తీలు ముమ్మరం చేయాలని తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం అమ్మకాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కొంతమంది వీటిని వ్యాపారంగా చేసుకొని గంజాయి అమ్మకాలు నిర్వహిస్తున్నారని, అలాంటి వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, డిఎస్‌పి కొండయ్య నాయుడు, సిఐ రాజా రమేష్, ఎస్‌ఐ గాయత్రి పాల్గొన్నారు.

పోటీ తత్వంతోనే ప్రతిభకు గుర్తింపు

ప్రజాశక్తి-సంబేపల్లి (రాయచోటి) : విద్యార్థులు చిన్ననాటి నుండి ఇతరులతో పోటీపడి చదివినప్పుడే వారిలోని ప్రతిభకు గుర్తింపు లభిస్తుందని జిల్లా ఓపెన్ స్కూల్ జిల్లా కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం సంబేపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 'నీటి సమస్యలు- పరిష్కారాలు' అనే అంశం మీద అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై ఉన్న సహజ వనరులలో నీరు అతి ముఖ్యమైనదన్నారు. ప్రతి నీటి బొట్టు ప్రాణా ధారమేనని నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. నీటి ప్రాముఖ్యతపై వ్యాస రచన పోటీలు నిర్వహించి విద్యార్థులలో సామాజిక స్పృహను పెంపొందింప చేస్తున్న ఏకలవ్య ఫౌండేషన్ కోఆర్డినేటర్‌రెడ్డి శేఖర్ సేవలను అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి, కూలర్స్ హరినాధ రాజు, తెలుగుదేశం నాయకులు మూడే జయరాం అఖండ నాయక్, జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి, రిసోర్స్ టీచర్స్ రెడ్డన్న, రెడ్డయ్య రాజు పాల్గొన్నారు.

'అన్నమయ్య' బాధిత రైతులను ఆదుకోవాలి : జిఎన్

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



మాట్లాడుతున్న నాయుడు

అన్నమయ్య ప్రాజెక్టు డ్యాం తెగిపోయి నష్టపోయిన పరీవాహక బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రీజెన్సీ నలంద విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ జి.ఎన్. నాయుడు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక నలంద పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్నమయ్య వరద బాధితులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల ప్రజలు అందరూ వ్యవసాయదారిత కుటుంబాలేనని, ప్రస్తుత ఎన్‌డిఎ ప్రభుత్వం మరోమారు ప్రాజెక్టును, అక్కడి ప్రజల దుర్భర జీవితాలను పరిశీలించి డ్యాం పునర్నిర్మాణం చేసి వరద బాధితులను, రైతులను ఆదుకోవాలని కోరారు. దేశంలోనే విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు ఒక్కరేనని, విజయవాడలో సంభవిం చిన వరదలలో 72 ఏళ్ల వయసులోనూ ప్రజల కోసం పరితపించి వరద బాధితులను అన్ని విధాల ఆదుకోవడం ప్రశంసనీయమన్నారు. రాజంపేట నియోజకవర్గం వైపు కూడా దృష్టి సారించి వెనకబడిన ఈ ప్రాంతాన్ని అన్ని విధాల అభివృద్ధి చేయాలని కోరారు. రాజంపేటలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, పరిశ్రమలు లేక ఉపాధి కరువై గల్ఫ్‌దేశాలకు వలసలు పోతున్నారని ఆవేదన చెందారు.

'లైసెన్స్ లేకుండా టపాసులు అమ్మితే కఠిన చర్యలు'

ప్రజాశక్తి-రాయచోటి

లైసెన్సు లేకుండా టపాసులను అమ్మడం చట్టరీత్యా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, టపాసులు అగ్ని ప్రమాదాలకు కారకం కాబట్టి భద్రతా చర్యలను కచ్చితంగా పాటించాలని కలెక్టర్ శ్రీధర్ చామకూరి పటాకులను అమ్మే వ్యాపారస్తులను ఉద్దేశించి తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో టపాసులు అమ్మేందుకు లైసెన్సు పొంది ఉన్న వ్యాపారస్తులతో సమీక్ష సమావేశాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైసెన్సు ఉన్నవారు మాత్రమే టపాసులను అమ్మాలని, లైసెన్సు లేకపోతే లైసెన్స్ తీసుకొని అమ్మాలని, లైసెన్స్ లేకుండా అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లైసెన్సులో తెలిపిన విధంగా వారికి ఎంత సామర్థ్యం వరకు లైసెన్స్ ఇవ్వబడిందో అంత సామర్థ్యం వరకు మాత్రమే టపాసులను ఉంచుకొని అమ్ముకోవాలని అంతకు మించి అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. అగ్ని ప్రమాదాలను దృష్టిలో పెట్టుకొని లైసెన్సులో తెలిపిన నిబంధనల మేరకు అగ్నిమాపక పరికరాలు, నిబంధనల మేరకు టపాసుల సామర్థ్యాన్ని బట్టి నీటి నిలువ ఉండాలన్నారు. అగ్ని ప్రమాదాలను నివారించేందుకు ప్రత్యేకంగా కనీసం ఇద్దరు మనుషులను ఏర్పాటు చేయాలన్నారు. సూపర్ మార్కెట్‌లో వస్తువులను అమ్మే విధంగా కొనుగోలుదారులు షాపులోకి తిరిగే విధంగా ఏర్పాట్లు ఉండరాదని, కొనుగోలుదారుడు బయటనే ఉండాలన్నారు. టపాసుల రేట్లు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఉండాలన్నారు. టపాసుల షాపులను ఏర్పాటు చేసేందుకు కేటాయించబడే స్థలంలో విద్యుత్ వైర్లను నాణ్యమైన వాటిని వాడాలని, వాటిపట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సమావేశంలో మదనపల్లి, రాజంపేట సబ్ కలెక్టర్లు మేఘ స్వరూప్, నైదియాదేవి, రాయచోటి ఆర్‌డిఒ రంగస్వామి, డిఎఫ్‌ఒ అనిల్ కుమార్, పోలీస్ అధికారులు, జిల్లాలో టపాసులను అమ్మేందుకు లైసెన్స్ తీసుకున్న వ్యాపారస్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

రైతులు ఆధునిక పద్ధతులు పాటించాలి

- రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-చిన్నమండెం

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు సలహాలు పాటించి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించాలని రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని మల్లూరులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అధిక నిధులు ఖర్చు చేస్తోందన్నారు. రైతులకు సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ అందజేసి ఆదుకుంటామని తెలిపారు. విత్తనాలు, ఎరువులు సబ్సిడీతో అందజేస్తున్నామన్నారు. 80 శాతం సబ్సిడీతో రైతులకు మంత్రి చేతుల మీదుగా ఉలవలు పంపిణీ చేశారు. రైతులకు ఎటువంటి భూ సమస్యలు ఉన్న తమకు తెలియజేసి పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జిల్లా అధికారి చంద్రనాయక్, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ప్రజల నుంచి వినతులు స్వీకరణ : మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని తమ నివాసంలో మంత్రి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు తమ సమస్యలు విన్నవించేందుకు వందల సంఖ్యలో ప్రజాదర్బార్‌కు తరలివస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు ఉదయం ఆరు గంటలకే మంత్రి ఇంటి దగ్గరికి చేరుకొని వినతి పత్రాలతో బారులు తీరారు. మంత్రి ప్రతి సమస్యను ఓర్పు సహనంతో విని సమస్యలు పరిష్కరించేందుకు బాధితులకు హామీ ఇచ్చారు.

భూ సమస్యలకు త్వరలో శాశ్వత పరిష్కారం

గాలివీడు : భూ సమస్యలకు త్వరలో శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోపనపల్లెలో 'ఇది మంచి ప్రభుత్వం' ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పడిన వంద రోజులలో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలతో మంచి అనిపించుకుంటున్నామన్నారు. మెగా డిఎస్‌సి ద్వారా 16,437 టీచర్ పోస్టులు భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను నివారించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం వచ్చే దీపావళికి అర్హులైన ప్రతి ఇంటికి మూడు సిలిండర్లు ఇచ్చే కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. గాలివీడు మండలం అభివృద్ధిలో వెనుకబడి ఉందని ఈ ప్రాంతంలో త్వరలో రోడ్లు, డ్రెయినేజీ, మంచినీటి సమస్య పరిష్కరిస్తామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. గత ప్రభుత్వంలో భూ ఆక్రమణలు జరిగాయని అవన్నీ తిరిగి స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. రాబోయే ఐదు సంవత్సరాలలో రాయచోటి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : మొక్క మనిషికి జీవనాధారం లాంటిదని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని గోపనపల్లె సచివాలయం వద్ద మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటునందించాలన్నారు. మొక్కల పెంపకాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు కృషి చేయాలన్నారు. మొక్కల వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని మనమందరం భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకొని మొక్కల పెంపకం విస్తృతంగా చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

మైనింగ్ మాఫియాకు అధికార పార్టీ అండదండలు : సిపిఎం

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

అధికార పార్టీ అండదండలతో మైనింగ్ మాఫియా చెలరేగిపోయి ఇసుక, మట్టి కొల్లగొడుతున్నదని సిపిఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. అధికారంలో ఉన్న పార్టీలు మారినా మైనింగ్ మాఫియా మారలేదని, ఎవరు అధికారంలో ఉంటే వారి పంచన చేరుతున్నారని విమర్శించారు. మంగళవారం స్థానిక జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న ఉచిత ఇసుక విధానం కారణంగా జిల్లాలో ఉన్న ప్రజలకి ఇసుక అందుబాటులోకి లేకుండా పోయిందన్నారు. భవన నిర్మాణం పనులు జరగడం లేదని భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని పేర్కొన్నారు. మైనింగ్ మాఫియా మాత్రం అధికార పార్టీ అండదండలతో పెద్ద ఎత్తున ఇసుకను తరలించకపోతున్నారని తెలిపారు. జిల్లాలో ప్రతిరోజు టిప్పర్లతో రూ.లక్షల విలువ చేసే ఇసుకను తోడి, తరలిస్తున్నారని, అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడలేదని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో ఇసుక లభించకపోవడం, రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతి వలన ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందని, అనేక కారణాలతో పాటు ఇసుక సమస్యపై ఆగ్రహంతో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించారని పేర్కొన్నారు. ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి తెలుగుదేశం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని గుర్తు చేశారు. వందరోజుల పాలనలో చూస్తే ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేకుండా పోయిందని, అన్ని ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా తోడేసి అమ్ముకున్నారని, ప్రస్తుత ప్రభుత్వంలో కూడా ఇసుకను, మట్టిని అక్రమంగా తోడుకుని తరలించేస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీ నాయకులకు కప్పం కట్టని ఇసుక ట్రాక్టర్లు మాత్రమే పోలీసులకు పట్టుబడుతున్నాయని, ఏకంగా మంత్రి కనుసన్నల్లో ఇసుక, మట్టి అక్రమాలు జరుగుతున్నాయని రాజంపేట నియోజకవర్గ నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం ప్రకటించడం బట్టి చూస్తే ఇసుక, మట్టి అక్రమాల ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం అవుతోందని పేర్కొన్నారు. జిల్లాలో యథేచ్ఛగా ఇసుక, మట్టి అక్రమాలు జరుగుతున్నా ఒక్క టిప్పర్ కూడా అధికారుల కంట పడలేదంటే అనుమానం కలుగుతోందని పేర్కొన్నారు. మైనింగ్, ఎస్‌ఇబి, ఇరిగేషన్ రెవెన్యూ, పోలీసు అధికారులు మాఫియాతో కుమ్మక్కైనందువలన ఇసుక యథేచ్ఛగా తరలించకు పోగలుగుతున్నారని తెలిపారు. చిన్న చిన్న వాగులు కుంటల్లో పేదలు ఎత్తే ఇసుకను తీవ్రమైన ఆంక్షలు విధిస్తూ వేలకు వేలు ఫైన్లు వసూలు చేస్తున్నారు తప్ప, టిప్పర్లతో రూ.లక్షల విలువ చేసే ఇసుకను తరలిస్తున్న వారి జోలికి వెళ్లడం లేదని, అందుకనే ఒక్క టిప్పర్ కూడా మామూళ్ల మత్తులో జోగుతున్నందునే మైనింగ్, ఎస్‌ఇబి, ఇరిగేషన్ రెవెన్యూ, పోలీసు అధికారులకు కంటపడలేదని విమర్శించారు. ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు పలుచోట్ల ఇసుకపై పెత్తనం చేస్తున్నారని, ముఖ్యమంత్రి పదేపదే బహిరంగంగా హెచ్చరిస్తున్నా పరిస్థితిలో మార్పు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందరికీ ఉచితంగా ఇసుక లభించే విధంగా, అందరికీ అందుబాటులోకి ఇసుక తీసుకురావాలని, అవినీతిని అరికట్టాలని, భవన నిర్మాణాలు చేసుకునే వారిపై అధిక భారం లేకుండా చూడాలనీ కోరారు. జిల్లాలో ఇసుక అందరికి అందుబాటులో రావాలని, మైనింగ్ మాఫియాకు వ్యతిరేకంగా ప్రజలను కూడగట్టి ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న శ్రీనివాసులు

ఎంఇఒను సస్పెండ్ చేయాలి : పిడిఎస్‌యు

ప్రజాశక్తి-రాయచోటి

సంబేపల్లి ఎంఇఒగా విధులు నిర్వహిస్తూ అధికార దుర్వినియోగానికి పాల్పడిన రమాదేవిని తక్షణమే సస్పెండ్ చేయాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో డైట్ పాఠశాలలో మాట్లాడుతూ తమ కార్యా లయంలో పనిచేస్తున్న అటెండర్లను తన కారును శుభ్రం చేయడానికి ఉపయోగించడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. పాఠశాలల తనిఖీకి తాను వెళ్లేటప్పుడు తన కార్యాలయంలో పనిచేసే ప్రదీప్‌ను తన కారు డ్రైవర్‌గా ఉపయోగించుకోవడం ఆమె అధికార దుర్వినియోగానికి పరాకాష్టన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఉద్యోగులను ఎంతో గౌరవంగా చూస్తున్నప్పటికీ ఉపాధ్యాయుల అవహేళన చేస్తూ, అవమానిస్తూన్న ఎంఇఒల వలన ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి గ్రూపునకు రమాదేవి గత ఎన్నికలలో టిడిపికి ఓటు వేసిన ఉపాధ్యాయులను టార్గెట్ చేస్తూ వేధించడం అన్యాయమన్నారు. గత మార్చిలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో డిఇఒ పంపిన ఇన్విజిలేటర్ల జాబితాను మార్చి తనకు అనుకూలమైన ఉపాధ్యాయులను పరీక్షల విధులకు కేటాయించడం, వారి ద్వారా పగడ్బందీగా నిర్వహించవలసిన పరీక్షలను అపహాస్యం చేసిన నైజం ఆమెదన్నారు. పరీక్షల సమయంలో పరీక్ష పత్రాలను ఓపెన్ చేసిన తర్వాత అక్కడే ఉండి తరువాత బయటకు రావడం నిబంధనలకు విరుద్ధమన్నారు. ఈ విషయమై కలెక్టర్ జోక్యం చేసుకొని సమగ్ర విచారణ చేపట్టాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పిడియస్ యు జిల్లా నాయకులు ప్రసాద్ పాల్గొన్నారు.



ఉర్దూ విద్యార్థినులకు కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

పోటీ పరీక్షల్లో సత్తాచాటాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లి : ఉర్దూ విద్యార్థులు పోటీ పరీక్షలలో సత్తా చాటాలని ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా అన్నారు. రాష్ట్ర మైనార్టీ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ సంస్థ ద్వారా నెల రోజులుగా స్థానిక మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) ఉచిత శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ఉర్దూ భాషా, మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట వేస్తుందన్నారు. అన్ని జిల్లాల్లోనూ టెట్ పోటీ పరీక్షలకు హాజరయ్యే ఉర్దూ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తుందన్నారు. మంచి మార్కులు సాధించి టీచర్ పోస్టులను సాధించాలన్నారు. మైనార్టీల్లో విద్యా చైతన్యం రావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనార్టీ సంస్థ ద్వారా ముద్రింపబడిన స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. జిల్లాకు సంబంధించి మదనపల్లిలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణా కేంద్రంలో శిక్షణ పొందుతున్న ఇతర జిల్లాల విద్యార్థులకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో వసతి, భోజన సౌకర్యాలను కల్పించారు. భవిష్యత్తులో జరిగే డిఎస్‌సికి కూడా తన వంతు సహకారం అందించి, ఉచిత భోజన, వసతి సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూటా రాష్ట్ర నాయకులు పఠాన్ మహమ్మద్ ఖాన్, కౌన్సిలర్ నాగార్జున బాబు గాంధీ, టిడిపి రాష్ట్ర మైనార్టీ నాయకులు ఎస్.ఎ.మస్తాన్, పార్టీ నాయకులు నాదేళ్ల విద్యాసాగర్, గంగారపు నవీన్ చౌదరి, దాదూఖాన్, జన సేన నాయకులు రామాంజనేయులు, ప్రధానోపాధ్యాయులు ఎ.షాజహాన్, పాఠశాల కమిటీ చైర్మన్ మహమ్మది, ఉపాధ్యాయులు ఇస్మాయిల్, హాఫిజా, నాదిర్ షావలి వివిధ జిల్లాలకు చెందిన టెట్ శిక్షణార్థులు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

ప్రజాశక్తి-వాల్మీకిపురం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఎంపిడివో మనోహర రాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి పీలేరు నియోజకవర్గ ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యేకి సమర్పించుకోవచ్చునని తెలిపారు. అలాగే మధ్యాహ్నం 12గంటలకు తహశీల్దార్ కార్యాలయంలో మండలస్థాయి అధికారుల సమీక్ష సమావేశం, 3గంటలకు మండలంలోని చింతపర్తి గ్రామ పంచాయతీ నందు ప్రజాదర్బార్, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

ప్రజాశక్తి-సుండుపల్లి

గర్భిణులకు మంచి పోష్టికాహారాన్ని అందించాలని సూపర్‌వైజర్ వెంకటలక్ష్మమ్మ పేర్కొన్నారు. మండలంలోని సుండుపల్లె గ్రామపంచాయతీలో ఈడిగపల్లె అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సుందర్భంగా సుండుపల్లి-2 సెక్టర్‌లో అంగన్వాడీ కార్యకర్తల సమా వేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని చిన్నపిల్లలు, గర్భిణులు, బాలింతలకు క్రమం తప్పకుండా అందించాలని సూచించారు. ఉన్నతాధికారులు ప్రతిరోజూ తనిఖీలు నిర్వహిస్తూ ఉంటారని అప్రమత్తంగా విధులను సక్రమంగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. ప్రతి అంగన్వాడీ కార్యకర్త తప్పకుండా సమయపాలన పాటించాలని, రికార్డులను సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు సంధ్య, మస్తానీ, తులసి, సాయి, హేమలత, బండి శ్రీదేవి, మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ఇటీవల వినాయక నిమజ్జనం వేడుకల్లో తమపై పోలీసులు అక్రమంగా కేసులు నమోదు చేశారని స్థానిక పోకనాటివీధికి చెందిన వైసిపి నాయకులు తెలిపారు. ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిల సహకారంతో హైకోర్టు నుంచి బెయిల్ మంజూరు అయ్యిందని తెలిపారు.మంగళవారం తంబళ్లపల్లికి వెళ్లి ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపామని చెప్పారు. తమను నమ్ముకున్న నాయకులు, కార్యకర్తలకు పెద్దిరెడ్డి కుటుంబం అండగా ఉంటుందన్నారు. మూడు నెలల్లోనే కూటమి ప్రభుత్వ విధానాల పట్ల ప్రజలు విసిగిపోయారని పేర్కొన్నారు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నా తెలిపారు. ఇది ఎక్కువ రోజులు కొనసాగవని అన్నారు. వైసిపి బలోపేతానికి మరింతగా కృషి చేస్తామని తెలిపారు.

డ్రైవర్లకూ సంక్షేమ చట్టం తీసుకురావాలి

ప్రజాశక్తి -బి.కొత్తకోట

అసంఘటిత రంగంలోని చిన్న తరహా వాహనాల డ్రైవర్లుగా ఉపాధి పొందుతున్న లక్షలాది మంది కార్మికులకు సంక్షేమ చట్టం తీసుకురావాలని ఎఐటియుసి నాయకులు ఎస్.మనోహర్‌రెడ్డి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.మంగళవారం స్థానిక రంగసముద్రం రోడ్డు నందు గల తిరుమల టాకీస్ ఆవరణంలో లైట్ మోటార్ వెహికల్ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం యూనియన్ అధ్యక్షుడు కంచి.బలరాంరెడ్డి అధ్యక్షతన జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మనోహ ర్‌రెడ్డి, మండల కార్యదర్శి జి.రఘునాథ్ మాట్లాడుతూ చిన్నతరహా వాహనాలైన ఆటో, కారు, జీపు, టెంపో తదితర వాటిలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాదిమంది ఉన్నత చదువులు చదువుకున్న నిరుద్యోగ యువకులు డ్రైవ ర్లుగా పనిచేస్తూ ఉపాధి పొంది తమ కుటుంబాలను పోషించుకుంటున్నారని అన్నారు. డ్రైవర్లకు కూడా సంక్షేమ చట్టం తీసుకువచ్చి వారి కుటుంబాలను ఆదుకోవా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో సమావేశంలో యూనియన్ నాయకులు ఎం.వెంకట కృష్ణయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-తంబళ్లపల్లె : మండల కేంద్రంలోని నాగేంద్ర వీధికి చెందిన వైసిపి కార్యకర్త వాసా భాస్కర్ గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పెద్దిరె డ్డి ద్వారకనాథ్‌రెడ్డి మంగళ వారం ఆయన మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి పరామర్శించారు. పదివేల రూపాయల ఆర్థిక సాయం కుటుంబ సభ్యులకు అందించారు. స్థానిక నాయకులు మైనుద్దీన్ రూ.5వేలు ఎమ్మెల్యే వెంట మండల పార్టీ కన్వీనర్ చౌడేశ్వర్, కో-ఆప్షన్ సభ్యులు జమాల్ బాషా, నాయకులు రామ్మూర్తి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలపై గళం వినిపిద్దాం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె : రేషన్ డీలర్ల సమస్యలపై బలంగా గళం వినిపించడానికి రాష్ట్రంలోని రేషన్ డీలర్లు అందరూ ఐక్యం కావాలని నిమ్మనపల్లె రేషన్ డీలర్ల మండల అధ్యక్షులు గంగాధర, ఉపాధ్యక్షులు మల్లేశ్వర పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 25న బుధవారం విజయ వాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆల్ ఇండియా రేషన్ డీలర్స్ సంక్షేమ సమాఖ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని నలుమూలల నుంచి రేషన్ డీలర్ల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొంటారని తెలిపారు. ప్రధానంగా దేశవ్యాప్తంగా ఉన్న సుమారు 5.35 లక్షల మంది రేషన్ డీలర్ల కు ఒకే విధమైన ఆర్థిక ప్రయోజనాలు ఉండేలా కోరుతున్నామన్నారు. రేషన్ డీలర్ల ద్వారా మార్కెట్ బియ్యం, చక్కెర, ప్రభుత్వం అందిస్తున్న ఇతర వంట సామాగ్రి పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక్కొక్క పౌర సరఫరా దుకాణం నుంచి 50 వేల రూపాయల వరకు ఆదాయం సమకూరేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా రేషన్ డీలర్స్ కమిటీ గత కొన్నేళ్లుగా పోరాటం చేస్తున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో కూడా రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి తగిన నిర్ణయాలను తీసుకుని, ప్రభుత్వానికి నివేదికలను పంపుతామని అన్నారు. రేషన్ డీలర్లు పాల్గొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు.

నేడు ఆర్.నడింపల్లిలో ఎమ్మెల్యే ప్రజాదర్బార్

ప్రజాశక్తి-రామసముద్రం : మదనపల్లి ఎమ్మెల్యే యం. షాజహాన్‌భాషా బుధవారం ఆర్.నడింపల్లి పంచాయతీ కేంద్రంలోని ఎంపిపి పాఠశాల ఆవరణంలో ఉదయం 10 గంటలకు నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని ఎంపిడిఓ. భాను ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రగతి నివేదికలతో హాజరు కావాలని తెలిపారు.

ఉలవ విత్తనాలకు ముందస్తు రిజిష్ట్రేషన్ చేసుకోవాలి

ప్రజాశక్తి-రామసముద్రం : మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాలలో ప్రభుత్వం నుంచి రాయితీ ద్వారా ఉలవలు పంపిణీకి బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో నమోదు కార్యక్రమం జరుగునున్నట్లు వ్యవసాయ అధికారి మోహన్ కుమార్ తెలిపారు. మండలానికి 390 క్వింటాళ్ల ఉలవలు అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఉలవలు అవసరమైన రైతులు తమ పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్ కార్డ్, ఫోన్ నెంబర్ తప్పనిసరిగా తమ వెంట తీసుకొనిరావలని ఒక్కో రైతుకు 10 కిలోలు చొప్పున పంపిణీ చేయబడునని తెలిపారు. 10 కిలోల పూర్తి ధర రూ.870, సబ్సిడీ రూ.696, రైతు వాటా రూ.174 చెల్లించి ముందుగా రిజిష్ట్రేషన్ చేసుకోవాలన్నారు. నగదు చెల్లించిన రైతులకు మాత్రమే విత్తనాలు పంపిణీ చేస్తామని తెలిపారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి, ఎమ్మెల్యే అరవశ్రీధర్ పేర్కొన్నారు. ఒబనపల్లి రైతు సేవ కేంద్రంలో కోడూరు నియోజకవర్గం పరిధిలోని 5 మండలాలకి సంబంధించి వ్యవసాయ,అనుబంధ శాఖలు నిర్వహిస్తున్న పొలం పిలుస్తుంది కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్, టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పాల్గొని ప్రారంభించారు. వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతుల కోసం ఆయా శాఖల ద్వారా అందిస్తున్న సేవలు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ఈ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రైతుల అభివృద్ధికి కృషి చేయాలని కోరారు కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు కె.కవిత, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు సురేష్ రాజు, వైఎస్ఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం, అంతరాజుపేట శాస్త్రవేత్త సందీప్ నాయక్, కెవికె ఊటుకూరు శాస్త్రవేత్త ప్రభాకర్ రెడ్డి, ఉద్యాన శాఖ అధికారి భాస్కర్ వ్యవసాయ శాఖ అధికా రులు సుధాకర్, మల్లిక నియోజక వర్గంలోని 5 మండలాల వ్యవసాయ అధికారులు, డ్రిప్ ఇరిగేషన్ అధికారులు, మార్కెటింగ్ అధికారులు, ఆత్మ బిటిఎం బాలసుబ్రమణ్యం, కూటమి నాయకులు కట్టా గుండయ్య నాయుడు, టివిరమణారెడ్డి, గడికోట సుబ్బరాయుడు, కస్తూరి చంద్రశేఖర్ నాయుడు, వెంకటేశ్వరరాజు, రామరాజు, తాతంశెట్టి నాగేంద్ర, సర్పంచ్,ఉప సర్పంచ్, ఎంపిటిసిలు పాల్గొన్నారు. **వీరబల్లి :** వ్యవసాయంలో తక్కువ పెట్టుబడులతో ఎక్కువ దిగుబడులు సాధించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది ని వ్యవసాయ శాఖ అధికారి ఎం. స్వాతి అన్నారు. పుత్తా వాండ్లపల్లి, పెద్ది వీడు గ్రామాలలో పొలం పిలుస్తోంది అనే కార్యక్రమంలో నిర్వహించారు. కార్యక్రమంలో టిడిని నాయకులు శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు పాల్గొన్నారు. వారంలో ప్రతి మంగళ, బుధ వారాల్లో రోజుకు రెండు గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించేలా ఆదేశించారు. వ్యవసాయ అనుబంధ శాఖలైన ఉద్యాన, సేంద్రియ, శాఖల అధికారులు పొలం బాట పట్టే దిశగా ప్రభుత్వం సంకల్పిం చిందని అన్నారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని బావికాడిపల్లె, తిరుమలయ్యగా రిపల్లె గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ అధికారి మరియు సంబంధిత అధికారులు పంట పొలాలను పరిశీలించారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు పొలంబాట, పంటల సాగుపై చర్చలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వరి, ఉలవలు, నూగులు మొదలగు పంటలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి కె.శ్రీకర్, పశుసంవర్ధక శాఖ అధికారి ఇక్బాల్, గ్రామ ఉద్యాన నాయకురాలు ప్రవీణ్, ఉదయభాను, దిలీప్ ప్రకృతి వ్యవసాయ పిఆర్‌పి మస్తాన్, రైతులు పాల్గొన్నారు. **రామాపురం :** సాగు చేసి పంటలకు తెగుళ్లు సోగకుండా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త మానస పేర్కొన్నారు. మండ లంలోని కల్పన నాయునిచెరువు, గోప గుడిపల్లి గ్రామాలలో మండల వ్యవసాయ అధి.కారి వై.నాగమణి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహిం చారు. కూరగాయలు సాగులో సస్యరక్షణ చర్యలు జీవన ఎరువుల వాడకం గురించి వివరించారు. మండల పశువైద్యాధికారి ప్రవీణ్ కుమార్ రెడ్డి ప్రస్తుత సీజన్‌లో పశువులకు వస్తున్న వ్యాధులు, వాటి నివారణ గురించి రైతులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి సుచిత్ర, రైతు సేవ కేంద్రం సిబ్బంది శ్రీకాంత్, వీణావాణి పాల్గొన్నారు. **కలకడ:** మండలంలోని ఏనుగొండపాలెం పంచాయతీలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించి



రైల్వేకోడూరు : పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న శ్రీధర్, రూపానందరెడ్డి

నట్లు మండల వ్యవసాయ అధికారిని లావణ్య పేర్కొన్నారు. వేరుశనగలో రూట్ రాట్ తెగులు గురిం చి కెవికె శాస్త్రవేత్త సోమశేఖర్ వివరించారు. కార్యక్రమంలో ఎడిఎ వాణిశ్రీ, దిగుపాలెం రైతు సేవ కేంద్రం ఇంచార్జ్ శరత్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** గత ఐదేళ్లలో వైసిపి అరాచకాల వలన రాష్ట్రంలో ఏర్పడిన సంక్షోభ పరిస్థితుల్లోనూ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవంతో రాష్ట్ర ప్రజానీకానికి సంక్షేమ ఫలాలు అందజేస్తున్నారని టిడిపి నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు.రాజంపేట పట్టణం లోని 7, 8 వార్డుల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మదనపల్లి :** రాబోయే రోజుల్లో మరింత మెరుగ్గా ప్రజలకు పాలన అందిస్తామని తంబల్లపల్లి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి అన్నారు. కురబలకోట మండలంలోని మట్లివారిపల్లి గ్రామంలో తంబళ్లపల్లె నియోజ కవర్గ ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ముని రెడ్డి,శ్రీనివాసులు, శేఖర్‌రెడ్డి, డిపి శ్రీనివాసరెడ్డి, అశోక్‌కుమార్, బాబు, గుణశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** పంటలకు జింక్ సల్ఫేట్ వాడకం వల్ల పంటలకు ప్రయోజనం చేకూరుతుందని ఎఒ నాగప్రసాద్ తెలిపారు. బసినికొండలో రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గంగన్నగారి పల్లి గ్రామం, వెంకప్ప కోట పరిధిలో రైతులతో పాటుగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రాటకొండ మధుబాబు, బాలాజీ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. **చిన్నమండెం :** మండలంలోని బోరెడ్డిగారిపల్లెలోని రైతుసేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది అనే కార్యక్ర మాన్ని నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్, జిల్లా ఉద్యాన అధికారి, పశు సంవర్ధక అధికారి,సహాయ వ్యవసాయ సంచాలకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వ్యసాయ అధికారి మాట్లాడుతూ గ్రామా లలో సాగు చేసిన పంటలు కచ్చితంగా పంట నమోదు, ఇకెవైసి తప్పని సరిగా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మంత్రి సతీమణి హరితమ్మ, సహాయ వ్యవసాయ సంచాల కులు, ఎఒ, ఉద్యాన అధికారి, పశు సంవర్ధక శాఖ అధికారి, వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** వ్యవసాయంలో రైతులు అధిక దిగుబడులను సాధించి, లాభాలను ఆర్జించటానికి మేలైన యాజమాన్య పద్ధత ులను అవలంబించాలని కలికిరి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ఏ.శ్రీనివాసులు, మదనపల్లి వ్యవసాయ శాఖ ఎడిఎ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఉద్యానవన శాఖాధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బందితో కలసి రెడ్డివారి పల్లి గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎఇఒ లక్ష్మీ ప్రసన్న, ఆర్ ఎస్ కే సిబ్బంది శ్రీకాంత్, రెడ్డి బాబు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే రాష్ట్రాభివృద్ధికి శ్రీకారం : ఎమ్మెల్యే



కలకడ : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి-కలకడ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వంద రోజుల్లోనే రాష్ట్ర అభివృద్ధికి శ్రీకారం చుట్టారని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు మండలంలోని ఏనుగొండపాలెం, బాలయ్యగారిపల్లి పంచాయతీలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టిన ఘనత చంద్రబాబు నాయుడు తోనే సాధ్యమని అన్నారు. పట్టణంలోని కూటమి కార్యకర్తలతో వంద రోజులు అభివృద్ధి కరపత్రాన్ని విడుదల చేశారు. గడిచిన ఐదేళ్లలో వైసిపి ప్రభుత్వం 12 లక్షల కోట్లు అప్పుచేసి, విశాఖలో ఐదు వందల కోట్లరూపాయల ప్రభుత్వ సొమ్ముతో ప్యాలెస్ నిర్మించు కున్నారని, రాష్ట్రాన్ని ఆర్థిక వ్యవస్థలు చిన్నా భిన్నం చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని అన్నారు. పట్టణ, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతులు అన్ని కార్యక్రమాలకు సహాయ సహకారాలు అందించి అభివృద్ధి వైపు నడిపిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **నిమ్మనపల్లె :** మదనపల్లె నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. మంగళవారం రెడ్డివారిపల్లె గ్రామంలో టిడిపి మాజీ మండల అధ్యక్షులు రాజన్న, మాజీ ఎంపిటిసి నాగరాజనాయుడు, స్థానిక సర్పంచు నూతనకాల్వ రెడ్డమ్మ నరేంద్రరెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ అధికారులతో కలిసి నిర్వహించిన ప్రజా దర్బార్, ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. వచ్చే దీపావళి నుంచి మహిళలకు సంవత్సరానికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ లను అందిస్తామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం పై కార్యచరణలను రూపొందిస్తున్నామని వీలైనంత త్వరలో వారికి ఉచిత బస్సు సౌకర్యాన్ని అందిస్తామని వివరించారు. మండ లంలో గ్రామాలకు సిసి రోడ్లు ఏర్పాటు చేయడానికి రూ.3.5 కోట్ల నిధులను మంజూరు చేశామన్నారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలోని విద్యార్థులకు దోమల బారి నుండి కాపాడటానికి రూ.3 లక్షల మండల గ్రాంట్ నిధులను కేటాయించి కిటికీలకు మెస్ సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్, మండల అధ్యక్షులు పుర్ర వెంకటరమణ, టిడిపి నాయకులు విద్యాసాగర్, రెడ్డప్ప రెడ్డి, రాజన్న, శ్రీపతి, మల్లికార్జున, మల్లప్ప, మాజీ ఎంపిటిసి నాగరాజు నాయుడు, తహశీల్దార్ ధనుం జయలు, ఎంపిడిఒ రమేష్‌బాబు, ఎస్‌ఐ తిప్పే స్వామి అధికారులు పాల్గొన్నారు. **రైల్వేకోడూరు :**మంగంపేట ఎపిఎండిసిలో నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకే ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానందరెడ్డి పేర్కొన్నారు. మండలం అనంత రాజుపేట గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే ఆరవ శ్రీధర్ పాల్గొన్నారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి కొన్నింటిని అక్కడికకకడే పరిష్కరించారు. **నందలూరు :** నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ లోని రెండవ సచివాలయం పరిధిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నందలూరు మండలం సర్పంచుల సంఘం అధ్యక్షులు నాగిరెడ్డిపల్లి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ జంబు సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు మాజీ కార్యదర్శిసయ్యద్ అమీర్, టిడిపి బిసి నాయకులు కానుకృతి వెంకటయ్య, చామంచి పెంచలయ్య, నారపు శెట్టి శివ, షేక్ మౌలా, మట్టి బాబు, మెహర్ , ఆకుల చలపతి ,శివ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సేవా భావాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-వీరబల్లి

ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-1, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ఆధ్వర్యంలో సేవా పథకం వేడుకలు మంగళ వారం ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపల్ అజంతుల్లా మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే సేవా భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్క వాలంటరీ స్వచ్ఛందంగా సేవ చేయాలని, సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని అన్నారు. తమ వంతుగా ప్రజలలో అంటు వ్యాధులు, పరిసరాల శుభ్రత పట్ల అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి అయిన తర్వాత ఎన్ఎస్-ఎస్ సర్టిఫికెట్లు కూడా అందిస్తామని అవి ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు ఉపయోగపడ తాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్, రమేష్ రాజు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు. **చిన్నమండెం:** మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలలో ఎన్ఎస్ఎస్ జాతీయ సేవా పథకం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థుల మానసిక శారీరక వికా సంతో పాటు సామాజిక సేవ స్పృహను చైతన్య వంతం చేయడమే ఎన్ ఎస్ ఎస్ ప్రథమ లక్ష్యము అని ప్రిన్సిపాల్ రమేష్ తన తెలిపారు. స్వచ్ఛందంగా సేవ కార్యక్రమాల్లో పాల్గొని పలువురికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :**స్థానిక బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.కృష్ణవేణి మాట్లాడుతూ నేటితరం విద్యార్థులు సామాజిక సేవా నిరతిని పెంపొందించుకోవాల్సిన అవసరం చాలా ఉందని, అందుకు తగిన ప్రాతిపదికను జాతీయ సేవా పథకం అందిస్తుం దన్నారు. అధ్యాపక సంఘం, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మలిగి రాఘవరెడ్డి మాట్లాడుతూ త్వరలో బిటి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయబోయే రక్తదాన శిబిరంలో విద్యార్థులు చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్ర మంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ శైలజా సిఎస్, తెలుగు అధ్యాపకులు డాక్టర్ డేరంగుల శ్రీనివాసులు, కెమిస్ట్రీ అధ్యాపకులు డాక్టర్ జి.చిన్నారెడ్డి విద్యార్థులుపాల్గొన్నారు. **కలకడ:** పిన్సి పల్ జయభారతి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ డే ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వక్తలు ఎన్ఎస్ఎస్ ఆవిర్భావం, చరిత్ర, లక్ష్యాలు, ప్రాముఖ్యత గూర్చి వివరించారు. గాంధీజీ శతజ యంతిని పుష్కరిం చుకొని 1969 సెప్టెంబర్ 24న దేశవ్యాప్తంగా 37 యూనివర్సి టీలలో 40 వేల మంది విద్యా ర్థులతో మొదలై నేడు దేశ వ్యాప్తం గా 39 లక్షల మంది విద్యార్థులతో సామా జిక సేవలో దూసుకుపోతుందని అన్నారు. కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపల్ ఎం.రమణయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పుష్పకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** అన్నమాచార్య యూనివర్సిటీ ఎస్‌సిసి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా పున్నీత్ సాగర్ అభయాన్ క్రింద గుండ్లూరు వద్దగల బహుదానది ఒడ్డున ప్లాస్టిక్, వ్యర్థ పదార్థాలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని యూని వర్సిటీ ఛాన్సలర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి, కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ఎంవి నారా యణ, డీన్ ఆఫ్ స్టూడెంట్స్ ఎఫైర్స్ డాక్టర్ ఎం.సుబ్బారావులు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎల్. ఓబులపతి, పీడీ డాక్టర్ బి.నాగముని, ఎన్‌సిసి ఇన్‌ఛార్జి ఎన్.దీప్తి పాల్గొన్నారు. **నందలూరు :** విద్యార్థి దశ నుంచి విద్యార్థులు సేవా భావాన్ని అలవారాచుకోవాలనే ఉద్దేశ్యంతో జాతీయ సేవా పథకం 1969లో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని రాజంపేట స్పెషల్ జ్యూడిషల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ దినోత్సవ సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమయన పాల్గొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు సేవా భావాలు పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీదేవి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ నీలవేణి మేజిస్ట్రేట్ డాక్టర్ శంకర్, అధ్యాపకులు వసంత్, రమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిహెచ్.చంద్రశేఖర్

బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

నియోజకవర్గంలో బొప్పాయి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. రైతులు వందలాదిమంది బొప్పాయి సాగు చేస్తున్నారని వీరికి గిట్టుబాటు ధర లేక, మధ్య దళారులు, సెట్‌లు సిండికేట్‌గా ఏర్పడి 16 రూపాయల నుంచి పది రూపా యలకు ధర తగ్గించారని అన్నారు. రైతుల పెట్టిన పెట్టుబడి కూడా రాదని, ప్రభు త్వం తక్షణం జోక్యం చేసుకొని గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ఒక చెట్టు మొలక పది రూపాయల పైగా పడుతుందని, ఎరువులు, దుక్కెలు, కూలీల, పురుగు మందులు, ఖర్చు, అప్పులకు వడ్డీలు,పెట్టిన పెట్టుబడి కూడా రాలేదని రైతుల ఆందోళన చెందుతున్నారని అన్నారు. పీలేరు, ఇతర ప్రాంతాల్లో టన్ను 25వేలు ఉండగా కోడూరులో మాత్రం పది వేల రూపాయలకే, కొంటున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటియు ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, రైతు సంఘం నాయకులు, ఆదినారాయణ, వెంకటన్న, శ్రీనివాసులు, నరసింహారెడ్డి, సుబ్రహ్మణ్యం, కాసిం, జాకీర్, ఖాదర్ వల్లి, మల్లిరెడ్డి, ప్రేమ్‌చంద్ పాల్గొన్నారు.

హెచ్ఐవిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-చిన్నమండెం

మండల పరిధిలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం వెలుగు సిబ్బంది హెచ్ఐవి, ఎయిడ్స్, సుఖ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌పి ఎస్.అల్లావలి, ఎపిఎం రెడ్డమ్మ మాట్లాడుతూ హెచ్ఐవి వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండడం వల్ల హెచ్ఐవికి గురికాకుండా చూసుకోవచ్చని తెలిపారు. చికిత్స కంటే నివారణే మంచిదని తెలిపారు. హెచ్ఐవి కేవలం అరక్షిత లైంగిక సంపర్కాలు, కలుషితమైన సూదులు, పరీక్షింపబడని రక్తము ద్వారా, హెచ్ఐవి ఉన్న గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు సంక్రమిస్తుందని తెలిపారు. ఆస్పత్రుల్లో హెచ్ఐవి పరీక్షలు ఉచితంగా అందుబాటులో ఉన్నాయని, పరీక్షలు చేయించు కున్న వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. హెచ్ఐవి నిర్ధారణ అయితే జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎఆర్‌టి కేంద్రాలు, లింక్ ఎఆర్‌టి కేంద్రాల ద్వారా ఉచితంగా మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మందులు వాడుతూ వైద్యుల సలహాలు పాటించినట్లయితే ఎటు వంటి ఆరోగ్యప రమైన ఇబ్బందులు లేకుండా జీవితం కొనసాగించవచ్చని తెలిపారు. జిల్లాలో అక్టోబర్ 12వరకు 200 గ్రామాల్లో అవగాహన సదస్సులు ఉంటాయని యువత, మహిళలు, పొదు పు సం ఘాలు, కార్మికులు, గ్రామ ప్రజలు, భాగస్వాములవ్వాలని పేర్కొన్నారు. కార్య క్రమంలో వెలుగు సిబ్బంది రామానుజులు, లింక్ వర్కర్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.27.48 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు

ప్రజాశక్తి-చిట్వేలి

చిట్వేలి నుంచి రైల్వేకోడూరుకు వెళ్లే మార్గంలో రూ.27.48 కోట్ల రూపాయల వ్యయంతో రోడ్డు విస్తరణ పనులకు శ్రీరామాపురం గ్రామం వద్ద మంగళవారం టిడిపి ఇన్‌ఛార్జి ముక్కా రూపానంద రెడ్డి, ఎమ్మెల్యే అరవ శ్రీధర్, తాతం శెట్టి నాగేంద్ర, కట్ట గుండయ్య నాయుడు, సాయివికాస్‌రెడ్డి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలల్లో భాగంగా రైల్వే కోడూరు నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని అన్నారు. ప్రతి మారుమూల గ్రామానికి తారు రోడ్లు, సిమెంట్ రోడ్లు వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ సుబ్బారెడ్డి, కూటమి నాయకులు తమ్మిశెట్టి మనీ, రాజుకుంట నరసింహ, కట్ట మనోజ్, సుధీర్‌రెడ్డి, మురళిరెడ్డి, మాదాసు నరసింహ, కరీంబాషా పాల్గొన్నారు.

విరబూసిన బ్రహ్మ కమలాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రంలోని వెంకటేశ్వరవీధిలో ఉన్న మండల కో-ఆప్షన్ సభ్యుడు జమల్‌బాషా ఇంటి ఆవరణలో బ్రహ్మ కమలాలు విరబూసాయి. మంగళవారం రాత్రి ఒకే రోజు 42 పుష్పాలు వికసించడం విశేషం. స్థానిక వీధిలోని పలువురు ఈ పుష్పాలను చూడడానికి ఎగబడ్డారు. ఈ మొక్కను 10 ఏళ్ల క్రితం మదనపల్లి నుంచి తీసుకొచ్చి నాటినట్లు ఆయన తెలిపారు. గత నెల ఆగస్టులో కూడా మూడు రోజుల పాటు 150 పుష్పాలు వికసించినట్లు తెలిపారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-సుండుపల్లి

మండల కేంద్రం సుండుపల్లిలోని అరెమ్మ దేవాయలం వద్ద బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నారని ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైసిపి నాయకులు యర్రపురెడ్డి అర్రంరెడ్డి పేర్కొన్నారు. శ్రీ వెంకటేశ్వర అరవింద కంటి ఆస్పత్రి సహకారంతో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దృష్టి లోపంతో బాధపడే పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలు పంపిణీ చేస్తామని తెలిపారు. శస్త్ర చికిత్స అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారికి ఉచిత భోజన వసతి కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని చిన్న గొల్లపల్లి గ్రామ సర్పంచ్ రామాజయచంద్ర పిలుపునిచ్చారు. వైద్య శిబిరానికి వచ్చే ప్రజలు ఆధార్ కార్డు తీసుకుని రావలసిందిగా సూచించారు.

చెరువు కట్టను పరిశీలించిన రెవెన్యూ అధికారులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - రామసముద్రం

ప్రజాశక్తి దినపత్రికలో మంగళవారం ప్రచురితమైన 'చెరువు కట్ట తొలగింపు' వార్త రెవెన్యూ అధికారులు స్పందించారు. సమస్య ఉన్న ప్రాంతానికి చేరుకొని చెరువు కట్ట పరిశీలించి ఆక్రమణ దారులను పిలిపించి వాస్తవాలను వివరించి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై చెరువు కట్టలు తొలగించడం కానీ, చెరువు భూభాగం ఆక్రమించకోవడం చేయకూడదని తెలిపారు. చెరువుకు ఉన్న హద్దులు ప్రకారం లోపలకు ఆక్రమదారులు ప్రవేశించకుండా ట్రెంచులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో ఆర్ఐ నాగరాజ, మండల సర్వేయర్ నాగరాజ, విఆర్ఒ హరిబాబు, విఆర్ఎ నారాయణస్వామి, కానిస్టేబుల్ హరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు ఎపిఎంగా దేవసేన

ప్రజాశక్తి-కలికిరి

కలికిరి మండల వెలుగు ఎపిఎంగా దేవసేన బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కలికిరి బదిలీపై వచ్చినట్లు ఆమె తెలిపారు. గతంలో తాను ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందని అన్నారు. డ్వాక్రా మహిళల సంఘాల అభివృద్ధి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. పొదుపు సంఘాలకు అందుబాటులో ఉండి వారి అభ్యున్నతికి తోడ్పడుతానని తెలిపారు.

క్రైం కార్నర్

ఇద్దరు గంజాయి విక్రేతలు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

గంజాయి అమ్ముతున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల అరెస్టుకు సంబంధించి మదనపల్లె రెండవ పట్టణ సిఐ రామచంద్ర తెలిపిన వివరాల మేరకు..పట్టణంలోని లక్ష్మీ నగర్‌లో కాపురం ఉంటున్న ఆవుల లక్ష్మయ్య, ధనియాల రమేష్‌లు గంజాయిని తీసుకువచ్చి స్థానికులకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి సోదాలు జరపగా అమ్మకానికి సిద్ధంగా ఉంచిన రెండు కిలోల గంజాయిని సీజ్ చేసి నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణ అనంతరం వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు. ఈ దాడుల్లో ఎఎస్ఐ రమణ, సిబ్బంది పాల్గొన్నట్లు చెప్పారు.